దేగ కళ్ళతో దసరా సెలవులు పాటించేలా చర్యలు చేపట్టండి

- ఇంటర్ అధికారులకు ఎస్సిపిసిఆర్ సభ్యులు సీతారాం ఆదేశాలు

విశాలాంధ్ర-శ్రీకాకుళం : దసరా పండుగను పురస్కరించుకొని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 19 నుండి 25 వరకు విధిగా రాష్ట్రంలోని అన్ని యాజమాన్యాల ఇంటర్మీడియట్ కళాశాలల యాజమాన్యాలు విధిగా సెలవులు పాటించాల్సిందేనని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం సూచించారు. గురువారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ఏ కళాశాలకు ఎటువంటి మినహాయింపులు ఉండబోవని అన్నారు. ప్రత్యేక తరగతులు, నృత్య తరగతులు, వెనుకబడిన విద్యార్థుల పేరిట ప్రత్యేక తరగతులు వంటివి నిర్వహించడం బాలల హక్కుల ఉల్లంఘనలు క్రింద పరిగణాల్సి వస్తుందని అన్నారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఇప్పటికే అన్ని జిల్లాల ఇంటర్మీడియట్ ఆర్ఐఓలకు వీటిపై స్పష్టమైన ఆదేశాలు జారీచేసిందని అన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక తనిఖీ బృందాలను ఏర్పాటు చేసి తరగతులు నిర్వహిస్తున్నట్టు పట్టుబడితే ఆయా కళాశాల గుర్తింపు రద్దుతో పాటు, క్రిమినల్ చర్యలు, అధిక మొత్తంలో అపరాధ రుసుములు విధించేలా ఉన్నతాధికా రులకు సిఫారసులు చేయాలని సూచించారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు జిల్లా ఉన్నతాధికారులు, ఆర్ఐఓల దృష్టికి ఫిర్యాదులు అందించడంతోపాటు ఏపీఎస్సీపీసీఆర్ 2018ఏజి మెయిల్‌కు తెలియజేయాలని కోరారు.

జిల్లాస్థాయి స్పోర్ట్స్ మీట్‌కు ముహూర్తం ఖరార్

అక్టోబర్ 29న కొన్న చిన్నారావు మెమోరియల్ స్పోర్ట్స్ మీట్

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం: ప్రతి ఏటా జిల్లాలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే స్వర్గీయ కొన్న చిన్నారావు మెమోరియల్ జిల్లాస్థాయి అథ్లెటిక్స్, తైక్వాండో ఛాంపియన్ షిప్-2023 పోటీలకు రంగం సిద్ధమౌతుంది. జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలు, స్కూల్‌గేమ్స్ కారణంగా వాయిదా పడిన స్పోర్ట్స్ మీట్ తదుపరి షెడ్యూల్‌ను నిర్వాహకులు ఖరారు చేశారు. కొన్న చిన్నారావు మెమోరియల్ అథ్లెటిక్స్ అక్టోబర్ 29వ తేదీన (ఆదివారం) నిర్వహిస్తున్నామని నిర్వహణ కమిటీ ముఖ్య ప్రతినిధులు కొన్న సత్యన్నారాయణ, కొన్న వెంకటేశ్వరరావు (వాసు), కొన్న మధుసూదనరావు, ప్రగాడ అశోక్‌కుమార్, పూడి బాలాదిత్య, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానం వేదికగా జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ సహకారంతో ఈ పోటీలు జరగనున్నట్టు వారు చెప్పారు. క్రీడాకారులు మరిన్ని వివరాలకు, తమ సందేహాలు నివృత్తి కొరకు జిల్లా అథ్లెటిక్స్ సంఘ ప్రధాన కార్యదర్శి, పీడీ ఎం.సాంబమూర్తి (సెల్: 8500271575)ని సంప్రదించవచ్చన్నారు.

రాష్ట్రస్థాయి ఖో-ఖో చాంపియన్షిప్ పోటీలకు చాకుపల్లి విద్యార్థులు

విశాలాంధ్ర-టెక్కలి: చాకిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు 42వ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రస్థాయి జూనియర్ బాలబాలికల ఖో-ఖో చాంపియన్షిప్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు ఎం. అనురాధ తెలియజేశారు. ఈనెల 20, 22 తేదీలలో చిత్తూరు జిల్లా యాదమరిలో జరగబోయే రాష్ట్రస్థాయి ఖో-ఖో పోటీలకు అండర్ 18 విభాగంలో చరణ్ సాయి, బొంగు లహరి 10వ తరగతి విద్యార్థులు పాల్గొంటారని తెలియజేశారు. ఎంపికైన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయురాలు ఎం. అనురాధ,పి.జగదీశ్వరరావు, కె.దాలయ్య,కే. నారాయణరావు, కే. మురళీకృష్ణ, పి. చిన్నారావు, పి.ఋషి, బి.ఆనంద్ రావు, ఆర్.జ్యోతి, కే.సుధారాణి, సిహెచ్.భారతి, టి.వైకుంఠ రావు, ఎం.మోహిని, వ్యాయామ ఉపాధ్యాయుడు బాదాన నారాయణరావు, పీఈటి రమేష్, క్రాంతి, పాఠశాల సిబ్బంది విద్యార్థులను అభినందించారు.

పేద ప్రజల కోసమే జగనన్న సురక్ష పథకం

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : పేద బడుగు బలహీనవర్గాల ప్రజల కోసమే జగనన్న సురక్ష పథకం అని మాజీ కేంద్రమంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి, సంతబొమ్మాళి మండలం జడ్పిటిసి పాల వసంత రెడ్డి, రాష్ట్ర కలింగ కార్పొరేషన్ చైర్మన్ పేడాడ తిలక్ అన్నారు. గురువారం సంతబొమ్మాళి మండలం జగన్నాథపురం, రుంకు హనుమంతపురం సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని, స్థానిక పంచాయతీ సర్పంచులు జోగి రాములమ్మ, ఎన్ని మన్మధరావు ఆధ్వర్యంలో జగనన్న సురక్ష పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్రంలో ఉన్న అన్ని గ్రామాల్లో ఉచితంగా వైద్య తనిఖీలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేయడం ఎంతో అభినందించదగ్గ విషయమని వారన్నారు. ఈ కార్యక్రమాల్లో నందిగామ మండలం ఎంపీపీ నడుపురు శ్రీరామ్మూర్తి, మండల కో ఆప్షన్ సభ్యులు, రూమ్కు హనుమంత పురం ఎంపీటీసీ రాజు, స్థానిక వైకాపా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

గట్లపై కూరగాయల సాగు... అదనపు ఆదాయం బాగు

విశాలాంధ్ర-ఆమదాలవలస : మండలం చేపేనపేట యూనిట్‌లో ప్రకృతి వ్యవసాయ విభాగంలో భాగంగా సిబ్బంది రైతులు చేత వరి పొలం గట్లపై పలు రకాల కూరగాయపంటలను సాగుచేసేలా రైతులను ప్రోత్సహిస్తున్నారు. ఈ సందర్భంగా సిబ్బంది ఎల్.టు డిజిటల్ సురేష్ మాట్లాడుతూ చేపేనపేట గ్రామంలో నా కాంపాక్ట్ బ్లాక్ పరిధిలో ఉన్న పదిమంది రైతులు వరి పొలం గట్లపై బహుళ పంటల విధానంలో కూరగాయలు సాగును చేసుకుంటున్నారని తెలిపారు. ఇప్పటి వరకు బెండ, చిక్కుడు, బీర, వంగ, ఆనప వీటి ద్వారా నాలుగు వేల వరకు ఆదాయాన్ని తీసుకున్నారని అన్నారు. ఈవిధంగా పొలం గట్లపై పలు పంటలు కూరగాయలు సాగు చేసుకోవడం ద్వారా ఇంటి అవసరాలకు సరిపడా కూరగాయలు లభించడంతోపాటు అదనపు ఆదాయాన్ని కూడా రైతులు పొందుతారని తెలిపారు.

ఆల్ ఇండియా పీజీ నీట్‌లో శివాజీకి ఉత్తమ ర్యాంక్

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : మండలం బోరుబద్ర గ్రామానికి చెందిన ఆరంగి శివాజీ ఆల్ ఇండియా పీజీ నీట్‌లో ఉత్తమ ర్యాంక్ సాధించారు. ఎంబీబీఎస్ పూర్తిచేసి, ఉత్తమ ర్యాంక్ సాధించి, విశాఖపట్నంలో గల ఆంధ్ర మెడికల్ కాలేజ్ యందు ఎండి ఎనస్తీషియా సబ్జెక్టు జాయిన్ అయ్యారు. ఇటువంటి ఉత్తమ సాదించటం తో చాలా ఆనందంగా ఉందని తండ్రి పౌరసఫరాల దుకాణం డీలర్ ఆరంగి రామారావు అన్నారు. ఇంతటి ర్యాంక్ సాధించిన ఘనత మన గ్రామానికే కాకుండా, మన పరిసరాల ప్రాంత వాసులకు ఎంతో గర్వకారణంగా చెప్పవచ్చునని, బోరుబద్ర గ్రామానికి చెందిన విద్యావంతులు అన్నారు.

సజ్జలకు సమస్యలను వివరించిన 'సువ్వారి'

విశాలాంధ్ర-ఆమదాలవలస : ఆమదాలవలస నియోజకవర్గంలో ఉన్న పలు సమస్యలను వైఎస్ఆర్సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సల హాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని వైఎస్ఆ ర్సిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సువ్వారి గాంధీ కలిసి సమస్యలను వివరించారు. నియోజకవర్గంలోని గ్రామాల్లో పార్టీ పరిస్థితులను గౌరవించారు. నియోజకవర్గంలో ఉన్న పలు సమస్యలను తెలియజేసి వాటి పరిష్కారానికి పరువు చూపాలని గాంధీ కోరారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితులను సజ్జలకు వివరించి సూచనలు సలహాలు తీసుకున్నారు. సమస్యలపై పరిష్కరించాలని సజ్జ లను మర్యాదపూర్వకంగా కలిసినప్పుడు వివరించినట్లు గాంధీ తెలిపారు.

మాన్‌కి బాత్ ప్రోగ్రాం సెల్ కన్వీనర్‌గా వంజంగి వేణుగోపాల్



విశాలాంధ్ర-టెక్కలి : రాష్ట్ర ఓబిసి మోర్చ మాన్ కి బాత్ ప్రోగ్రాం సెల్ కన్వీనర్ గా టెక్కలి మండలం బిర్లంగిపేట గ్రామానికి చెందిన వంజంగి వేణుగోపాల్ నియమించబడ్డారని ఒక ప్రకటన ద్వారా తెలిపారు. నియమించడానికి సహకరించిన పెద్దల రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి,రాష్ట్ర సంఘటనా మంత్రి మధుకర్,ఓబిసి మోర్చ రాష్ట్ర అధ్యక్షులు గోపి శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు పైడి వేణుగోపాలం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఉమా మహేశ్వరి,జిల్లా ఇన్చార్జి విజయానంద రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఉమా మహేశ్వర రావు కి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు.

దీపావళి నాటికి కె.టి రోడ్డు విస్తరణ పనులు పూర్తి

విశాలాంధ్ర-పలాస: పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ కె.టి రోడ్డు విస్తరణ పనులు త్వరతగతిన జరుగుతున్నాయని, ఇప్పటికే 80శాతం పనులు పూర్తి చేయడం జరిగిందని పలాస కాశీబుగ్గ మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు తెలిపారు. గురువారం కె.టి రోడ్డు విస్తరణాభివృద్ధి పనులను కమిషనర్ నాగేంద్రకుమార్‌తో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇప్పటికే విద్యుత్‌కు సంబంధించిన పనులు పూర్తి చేయడం జరిగిందని, తారు రోడ్డు వేసేందుకు పనులు వేగవంతంగా జరుగుతున్నాయని, దీపావళి నాటికి పనులు పూర్తి చేసి పట్టణ ప్రజలకు కానుకగా ఇస్తామన్నారు. ఆయనతో పాటు డి.ఈ సునీల్‌కుమార్, ఎ.ఇ అవినాష్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

రైతు పోరుబాట పాదయాత్ర

విశాలాంధ్ర-సారవకోట/జలుమూరు : పొలాలకు సకాలంలో నీరు లేక రైతాంగం పడుతున్న ఇబ్బందులపై ప్రభుత్వంపై పోరాటంగా రైతు పోరు బాట పాదయాత్రను సారవకోట మండలం, ధర్మ లక్ష్మీ పురం వద్ద నుండి మాజీ శాసన సభ్యులు -ఇన్‌చార్జ్ బగ్గు రమణమూర్తి మరియు నియోజకవర్గ సారవకోట మండల నాయకులు, రైతు సోదరులు "నే సైతం రైతు కోసం" కార్యక్రమాన్ని గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా రమణమూర్తి మాట్లాడుతూ రైతన్నలు వేసిన ఉబాలు నీరులేక ఎండిపోతున్నాయని, అప్పులు చేసి రైతన్న ఉబాలుచేస్తే నీరులేక ఎండి పోతున్న పైరును చూసి రైతులు కన్నీరుపెడు తున్నారన్నారు. ప్రభుత్వం నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని ఆయన కోరారు.

ఆకట్టుకున్న సరస్వతీదేవి సైకిత శిల్పం

విశాలాంధ్ర-ఆమదాలవలస : నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని దుర్గాదేవి అవతారాలలో ఒకటైన సరస్వతి దేవి అవతారాన్ని సైకత శిల్పి గేదెల హరికృష్ణ మండలంలోని గాజుల కొల్లివలస దరి సంగమేశ్వర కొండ వద్ద నిర్మించారు. ఈ సైకిత శిల్పం పలువురుని ఆకట్టుకుంది. సకల విద్యల కళామతల్లి సరస్వతి దేవి రూపాన్ని సైకిత శిల్పి రూపొందించారు. దసరా శరన్నవరాత్రులు సందర్భంగా గురువారం సంగమేశ్వర స్వామి ఆలయం వద్ద ఇసుకతో సైకత శిల్పాన్ని రూపొందించారు. అందరికీ విద్యాబుద్ధులు ఈ ఏడాది మంచిగా ఉండాలని మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని ఆకాంక్షిస్తూ ఈ రూపాన్ని రూపొందించినట్లు హరికృష్ణ తెలిపారు.

టీపీవోగా అప్పలరాజు

విశాలాంధ్ర-పలాస : పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ అధికారిగా నువ్వల అప్పలరాజు గురువారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో శ్రీకాకుళం మున్సిపాలిటీలో టిపిఎస్‌గా పనిచేస్తూ పదోన్నతిపై పలాస మున్సి పాలిటీలో టిపివోగా వచ్చారు. పలాస మున్సిపాలిటీలో టీపీవోగా పని చేసిన సీతారామ్ తాడేపల్లిగూడెం సహాయ పట్టణ ప్రణాళిక అధికారిగా బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో అప్పలరాజును నియమితుల య్యారు. అనంతరం పలాస మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, కమిషనర్ నాగేంద్రకుమార్‌కు మర్యాద పూర్వకంగా కలిసారు. ఆయనకు మున్సిపాలిటీ అధికారులు, సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

విశాలాంధ్ర-నందిగాం : మండలం కాపు తెంబూరు గ్రామానికి చెందిన కారిగ్గి మొఖలింగం 57 కొత్త అగ్రహారం వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బుధవారం సాయంత్రం ఇంటి నుంచి బయటికి వెళ్లారు. రాత్రి 8 గంటల సమయంలో కొత్త అగ్రహారం సమీపంలో రోడ్డు దాటుతుండగా లారీ ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. ఆయనకు పలాసలో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించగా, మెరుగైన వైద్యానికి శ్రీకాకుళం తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయ బ్యాడ్మింటన్ పోటీలకు అంపైర్‌గా తుంగాన శరత్

విశాలాంధ్ర-కవిటి: గోవాలో జరుగుతున్న జాతీయ బ్యాడ్మింటన్ పోటీలకు అంపైర్ గా వ్యవహరించడానికి తుంగాన శరత్ కు ఉత్తర్వులు అందినట్లు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు తమరాల జయరామ్ తెలిపారు. గురువారం నుండి ఈనెల 24వ తేదీ వరకు గోవాలో జరుగుతున్న నేషనల్ గేమ్స్‌లో బ్యాట్మెంటన్ పోటీలకు తుంగాన శరత్ అంపైర్‌గా వ్యవహరించనున్నారు. ప్రస్తుతం కవిటి ఉషోదయ బ్యాట్మెంటన్ అసోసియేషన్ సభ్యుడుగా అలాగే జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా శరత్ విధులు చేపడుతున్నారు. జాతీయ బ్యాట్మెంటన్ పోటీలకు అంపైర్‌గా ఎంపికకు సహకరించిన రాష్ట్ర బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్షుడు కిల్లం శెట్టి సాగర్, జిల్లా సంఘ కార్యదర్శి మెట్ట అశోక్, అంతర్జాతీయ అంపైర్, సీఈవో సూరిబాబు, సీనియర్ ఉపాధ్యక్షుడు బైరి దామోదర్, ఇతర కార్యవర్గ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈసందర్భంగా ఉషోదయ బ్యాట్మెంటన్ అసోసియేషన్ చీఫ్ పాట్రన్ లొల్ల రాజేష్, సర్పంచ్ పూడి లక్ష్మణరావు,ఉషోదయ యువజన సంఘం గౌరవ అధ్యక్షులు బెందాళం చిట్టిబాబు,అధ్యక్షులు పాండవ చంద్రశేఖర్,కార్యదర్శి పులకల వెంకట రావు,మాజీ జడ్పిటిసి సభ్యులు బెందాళం రమేష్, మాజీ సర్పంచ్లు ఆరంగి మధుబాబు, బెందాళం వెంకటేశ్వరరావు, ఉషోదయ సంఘ మాజీ అధ్యక్షుడు అరంగి రాజు, పొల్లాయి లక్ష్మణమూర్తి, బెందాళం రంగారావు, జిల్లా వాలీబాల్ సంఘ సహకార దర్శి బల్లడ రమేష్, బ్యాట్మెంటన్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు ఈశ్వరరావు ఎం ప్రసాద్, ఉమామహేశ్వరరావు తదితరులు శరత్ కు అభినందనలు తెలియజేశారు.

సామాజిక సేవలో ఎలియన్స్ క్లబ్ : క్లబ్ అధ్యక్షులు సూర్యప్రకాశరావు

విశాలాంధ్ర-అరసవల్లి: సామాజిక సేవలో ఎలియన్స్ క్లబ్ ఆఫ్ శ్రీకాకుళం ఎప్పుడూ ముందుంటుందని, అందులో భాగంగానే నగరంలోనే అనేక సామాజిక, సేవ కార్యక్రమాలు చేపడుతున్నామని క్లబ్ అధ్యక్షులు పి. సూర్య ప్రకాశరావు అన్నారు. నగరంలోని ఇలిసిపురం జంక్షన్‌కు సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద ఎలియన్స్ క్లబ్ సారథ్యంలో జీఎస్ వి జ్యూయలర్స్, బాలాజీ మెడికల్ వారి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత తాగునీటి పథకాన్ని శ్రీకాకుళం పొట్టిశ్రీరాములు మార్కెట్ కమిటీ చైర్మన్ అంధవరపు రామ, బాలాజీ మెడికల్ జామి కిరణ్ లు ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మిగిలిన స్వచ్ఛంద సంస్థలకు ధీటుగా, శ్రీకాకుళంలో ఎంతో చారిత్రక నేపథ్యం కలిగిన ఎలియన్స్ క్లబ్ ఆఫ్ శ్రీకాకుళం సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుడుతోందని వివరించారు. పాదచారులు, వాహనదారుల దాహార్తిని తీర్చేందుకే మంచినీటి సౌకర్యాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. త్వరలోనే రిమ్స్ ఆసుపత్రిలో కూడా మంచినీటి సౌకర్యాన్ని కల్పించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ పి.వి కష్ణారావు, పీఆర్వో త్రినాథరావు, జడ్‌సీ ఎన్ అప్పారావు, ట్రెజరర్ గణేష్, మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ కిల్లాన భోజ్‌కుమార్, వైభవ్ జ్యూయలర్స్ ఎ. రమేష్, ఎ నాగేశ్వరరావు, వి నాగేశ్వరరావు, ఎ నాగయ్య, పి. నాగేశ్వరరావు, పి.వి.ఎస్ రాజు, రామకష్ణ సీహెచ్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పథకం పేదలకు వరం

- జిల్లా పరిషత్ చైర్పర్సన్ పిరియా విజయ సాయిరాజ్

విశాలాంధ్ర-కవిటి: జగనన్న ఆరోగ్య సురక్ష పథకం పేదలకు వరం లాంటిదని జిల్లా పరిషత్ చైర్పర్సన్ పిరియా విజయ సాయిరాజ్ అన్నారు. ఈ మేరకు గురువారం మండల పరిధిలోని బల్లిపుట్టుగ గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా పరిషత్ చైర్పర్సన్ విజయ సాయిరాజ్ మాట్లాడుతూ పేదల ఆరోగ్యం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అధిక ప్రాధాన్యతను ఇస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు 9 రకాలైన వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. కావున ఈ అవకాశాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం అంగన్వాడి కార్యకర్తల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్ ను సందర్శించి వివిధ రకాల వంటలను రుచి చూశారు.గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం చాలా అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పి సూర్య నారాయణ, శ్రీకన్య దోలాయి, మాజీ ఏఎంసి వైస్ చైర్మన్ రజిని కుమార్ దోలాయి, ఎంపీటీసీ సభ్యులు మనోహర్ దోలాయి, వజ్జ ప్రసాద్, మార్పు వెంకటేష్, తలగన భుసయ్య, సర్పంచ్లు, ఎంపీటీసీ సభ్యులు, వైయస్ఆర్ సీపీ నాయకులు, కార్యకర్తలు, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 15,059 లబ్దిదారులకు 15.059 కోట్లు జగనన్న చేదోడు జమ : కలెక్టర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం: పేదలకు అండగా ప్రభుత్వం పనిచేయడం జరుగుతోందని రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి అన్నారు. జగనన్న చేదోడు పథకం కింద ఆర్థిక సహాయం చేసే కార్యక్రమం క్రింద రాష్ట్ర ముఖ్యమంత్రి వరుసగా నాల్గవ ఏడాది లబ్ధిదారుల ఖాతాలో వేయడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని గురువారం ముఖ్యమంత్రి ప్రారంభించారు. రాష్ట్రంలో 3,25,020 మంది అర్హులైన రజక, నాయిబ్రాహ్మణ, దర్జీ అన్నదమ్ములు, అక్కాచెల్లెళ్లకు రూ. 325.02 కోట్ల ఆర్థిక సహాయాన్ని సాయాన్ని కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు లో గురువారం బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. చేదోడు క్రింద ప్రతి ఏడాది 10 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించడం జరుగుతుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ మాట్లాడుతూ జిల్లాలో 6,393 మంది రజక లబ్ధిదారులు, 2,710 మంది నాయిబ్రాహ్మణులు, 5,956 మంది దర్జీ లబ్ధిదారులకు మొత్తం రూ. 15.059 కోట్ల రూపాయలు ముఖ్యమంత్రి వర్యులు బటన్ నొక్కి జమ చేయనున్నారన్నారు. ఇందులో భాగంగా ఆమదాలవలస నియోజకవర్గంలో 2,094 మంది, ఎచ్చెర్ల నియోజకవర్గంలో 2,210 మంది, ఇచ్ఛాపురంలో 1,610 మంది, నరసన్నపేటలో 2,172 మంది, పలాసలో 1,340 మంది, పాతపట్నంలో 1,590 మంది, శ్రీకాకుళంలో 2,235 మంది, టెక్కలి లో 1,808 మంది లబ్ధిదారులు ఉన్నట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో జిల్లాకు చెందిన నాయి బ్రాహ్మణ లబ్ధిదారులు పి. రామకృష్ణ, కొయ్యాపు పోలోడు, దర్జీ లబ్ధిదారులు వై ఆదిలక్ష్మి,టి పాపారావు, ఎన్ సుకన్య, రజక లబ్ధిదారులు ఎస్.రాజేష్, ఎస్. గీత, గౌరి మాట్లాడుతూ రజక, నాయీ బ్రాహ్మణ, టైలర్ల జీవితాల్లో మార్పు రావాలని, వారు మిగతా ప్రపంచంతో పోటీపడి ఎదగాలని వారికి చేదోడునిస్తూ వారికి అండగా నిలవాలన్నదే లక్ష్యం అని, నవరత్నాల ద్వారా పలు అభివృద్ధి సంక్షేమ పథకాలు అందించే ఘనత గౌరవ ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డికే దక్కిందాన్నారు. ఈసందర్భంగా నమూనా చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళింగ కోమటి కార్పొరేషన్ చైర్మన్ అందవరపు సూరిబాబు, పొందర కూరాకుల కార్పొరేషన్ చైర్ పర్సన్ రాజాపు హైమావతి, వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ గంగు శారద, శ్రీశైన దేవ్, పోలినేటి కార్పొరేషన్ చైర్మన్ గంగు శారద, బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆర్.గద్దెమ్మ, రజక, నాయి బ్రాహ్మణ, టైలర్ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన వారికి ఇళ్లస్థలాలు

-పాత్రికేయుల పట్ల సీఎం జగన్ సానుకూలంగా ఉన్నారు
- ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు

విశాలాంధ్ర-శ్రీకాకుళం : జర్నలిజాన్నే వృత్తిగా చేసుకొని, నిబద్ధతతో పనిచేస్తున్న జర్నలిస్టులకు అన్ని విధాలా ప్రభుత్వ అభివద్ధి సంక్షేమ పథకాలు అందించే దిశగా ప్రభుత్వం అడుగు వేస్తోందని ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు అన్నారు. గురువారం శ్రీకాకుళం ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి శాసపు జోగినాయుడు ఆధ్వర్యంలో జర్నలిస్టుల బందం ఆయన మర్యాదపూర్వకంగా కలుసుకొని దుశ్శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా కొమ్మినేని మాట్లాడుతూ పాత్రికేయ వత్తిలో చిత్తశుద్ధితో పని చేస్తున్న అనేక మంది పాత్రికేయులు కదు పేదరికాన్ని, దుర్భర జీవితాన్ని గడుపుతున్నారని, అటువంటి వారందరికీ సొంతింటి కల నేరవేర్చే దిశగా ముఖ్యమంత్రి చర్యలు తీసుకుంటున్నారన్నారు. రాష్ట్రంలో అర్హులై ఉండి, గతంలో ఎన్నడూ ఇంటి స్థలంగానీ, ఇళ్లగానీ పొందనటువంటి నిరు పేదలైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటా యించేందుకు సీఎం సిద్ధంగా ఉన్నారని వివరించారు. రాజకీయ పార్టీలకు కొమ్ము కాసేలా వార్తలు రాయకుండా విలువలతో కూడిన జర్నలిజం చేస్తున్నవారికి ఎల్లప్పుడూ సమాజంలో సముచితమైన గుర్తింపు, గౌరవం ఉంటుందని పేర్కొన్నారు. ప్రయివేటు పాఠశా లలో పాత్రికేయ కుటుంబ సభ్యులకు శతశాతం ఉచిత విద్య అందించేలా చర్యలు తీసుకోవాలని జర్నలిస్టులు కోరగా, ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అగ్రతాంబూలం ఇస్తోందని, జర్నలిస్టుల పిల్లలకు కూడా ఉచిత విద్య అందించే అంశం పరిశీలనలో ఉందన్నారు.

ఆ కులాలను ఓ.బి.సిలో చేర్చవద్దు

కొత్తూరులో తూర్పు కాపుల నిరసనలు

విశాలాంధ్ర-కొత్తూరు : రాష్ట్రంలో కొత్తగా అరు కులాలను ఓ.బి సి జాబితాలో చేర్చే ప్రతిపాదన పట్ల జిల్లా తూర్పు కాపు సంక్షేమ సంఘం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది ప్రభుత్వంపై వత్తిడి తెచ్చేందుకు గురువారం కొత్తూరులో తూర్పు కాపు సంఘం అధ్వర్యంలో నిరశన ర్యాలీ నిర్వహించింది. గోవుల రామారావు నాయుడు కమర్షియల్ కాంప్లెక్స్ నుండి స్థానిక నాలుగు రోడ్లు కూడలి నుండి ర్యాలీగా సాగి అక్కడ మానవ హారంగా ఏర్పడ్డారు. అనంతరం తాసిల్ దార్ కార్యాలయానికి చేరుకుని తూర్పు కాపు సంఘ నాయుకులు మెమొరాండంను అందజేశారు. ఈ నిరసన కార్యక్రమంలో జిల్లా తూర్పు కాపు సంక్షేమ సంఘం అధ్యక్షులు కోయెలాపు శ్రీనివాస రావు, వైస్ ఎంపీ పి లోతుగెడ్డ తులసి వర ప్రసాద్ రావు ,సంఘ పెద్దలు కొత్తూరు మాజీ సర్పంచ్ లోతుగెడ్డ లక్ష్మి నారాయణ నాయుడు, ఎంపీటీసీ రత్నకుమారి ప్రతినిధి గండీవలస ఆనందరావు. తూర్పు కాపు సంఘ ప్రతినిధులు అగ తముడి రంజిత్ , కర్లెమ్మ సర్పంచ్ లోతుగెడ్డ భగవాన్ నాయుడు సరస్వతి పోండేషన్ చైర్మన్. పో త్నూరు మధు తదితర నాయుకులు పాల్గొన్నారు. తహసీల్దార్‌కు బి.సి.డి.లో ఉన్న తూర్పు కాపులను బీసీ ఏ.గ్రూప్‌లో చేర్చాలి. వైశ్య, సిస్టకరణాలు, సోండి తదితర కులాలను ఓ.బి.సి జాబితాలో చేర్చవద్దు. సంక్షేమ పథకాల కేటాయింపులు భారీగా కేటాయించాలి తదితర డిమాండ్లతో కూడిన వినతపత్రాన్ని అందజేశారు.

కొత్తమ్మతల్లిని దర్శించుకున్న దానేటి శ్రీధర్

వార్షిక జాతర మహోత్సవానికి రూ. లక్ష విరాళం అందజేత

విశాలాంధ్ర-కోటబొమ్మాళి/శ్రీకాకుళం టౌన్: ఉత్తరాంధ్ర ఇలవేల్పు, కోరిన కోరికలు తీర్చే కల్పవల్లి కొత్తమ్మ తల్లి అని ప్రముఖ వైద్యులు డాక్టర్ దానేటి శ్రీధర్ అన్నారు. కోటబొమ్మాళి కొత్తమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం పురస్కరించుకొని ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు గురువారం డాక్టర్ దానేటి శ్రీధర్ కోటబొమ్మాళి కొత్తమ్మ తల్లిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు దానేటి శ్రీధర్ కు ఘనంగా స్వాగతం పలికి, వేద పండితులతో ప్రత్యేక పూజలు చేయించారు. ఈ సందర్భంగా దానేటి శ్రీధర్ మాట్లాడుతూ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న కార్యక్రమాలు, ఉత్సవాల నిర్వహణను అడిగి తెలుసుకున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారి తీర్థప్రసాదాలు, చిత్ర పటాన్ని అందజేశారు. డాక్టర్ దానేటి శ్రీధర్ కొత్తమ్మ తల్లి వార్షిక జాతర మహోత్సవానికి లక్ష రూపాయలు విరాళంగా ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, జగన్, చలం తదితరులు పాల్గొన్నారు.

కుట్టుచేతి వృత్తులే మహిళలకు చేయూత

విశాలాంధ్ర-పొందూరు: మానవసేవయే మాధవసేవగా బావించి నిరంతరం సాయినామాక్తీర్తనలతో వృద్ధుల సేవలో పునీతులయినసత్యసాయిసేవాసమితి సభ్యులు మహిళలుకు ఉపాధికాల్పానే ద్యేయంగా స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రాం ద్వారా కుట్టు శిక్షణ శిబిరం ద్వారా ఉపాధి కల్పనకు కృషిచేయడం పట్ల రాష్ట్ర అధ్యక్షులు ఆర్. లక్ష్మణరావు సాయి సేవ భక్త బృందానికి అభినందించారు. 27మంది మహిళలుకు 41రోజుల శిక్షణ అనంతరం ఉచిత కుట్టుమిషన్లు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వై. లింగరాజు, బి. నర్సింహా మూర్తి, సూర రామచంద్రరావు, పడాల ప్రసాద్, పెన్నాం తరణీయ చెట్టి, కన్వీనర్ తో కూడిన సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

మూగజీవి రోదనలు పట్టవా..

- పశువైద్యుల నిర్లక్ష్యం
- దూడకు జన్మనిచ్చి ఆవు మృతి
- 8గంటలు మృత్యువుతో పోరాడిన మూగ జీవి
- సిబ్బంది ఉన్న వైద్యానికి ఇబ్బందే

విశాలాంధ్ర-ఆమదాలవలస: ప్రభుత్వం పశువులకు వైద్య సౌకర్యం నేరుగా అందించేందుకు పశువైద్య శాలల తో పాటు సంచార రథాలను కూడా సిద్ధం చేసి అందుకు తగిన సిబ్బందిని కూడా నియమించింది. అయినప్పటికీ సకాలంలో వైద్య సౌకర్యాలు అందక పశువుల మృత్యువాత పడుతున్నాయి. వీటిపై వైద్యాధికారుల స్పందన అంతంత మాత్రం గానే ఉంది. పశు వైద్యుల నిర్లక్ష్యం కారణంగా కొత్తవలస గ్రామానికి చెందిన బొడ్డేపల్లి సూరిబాబు కు చెందిన పాడి ఆవు మృతి చెందింది. బుధవారం రాత్రి ఆడ దూడకు జన్మనిచ్చింది. కొద్దిసేపటికి (హూనం) బిడ్డ సంచి పేగుల తో సహా బయటికి రావడంతో రక్త స్రావణం జరిగి ఆవు ఆరోగ్యం దిగజారింది. రాత్రి సమయం కావడంతో పశువైద్యులు అందుబాటులో లేకపోయారు. సుమారు 8 గంటలపాటు ఆ మూగ జీవి నరకయాతన పడుతుండటం చూసి రైతు పశు వైద్యాధికారులకు సిబ్బందికి పలుమార్లు ఫోన్లు చేసినప్పటికీ వారు స్పందించలేదు. పది మీటర్ల దూరంలో పశు వైద్యశాల ఉన్నప్పటికీ వైద్యం అందక దూడకు జన్మనిచ్చి ఆవు మృతి చెందింది. కొత్తవలస పశు వైద్య కేంద్రంలో వెటర్నరీ సర్జన్‌తోపాటు వెటర్నరీ అసిస్టెంట్ దాదాపుగా ఐదుగురు సిబ్బంది ఉన్నప్పటికీ ఏఒక్కరూ గ్రామంలో అందుబాటు లో లేకపోవడంతో సకాలంలో వైద్య వంద లేదు దీంతో మూగ జీవాలు మృతి చెందుతున్నాయి. ఆవు ఖరీదు 40 వేలు ఉంటుందని రైతులు అంచనా వేస్తున్నారు. సచివాలయంలో కూడా ఉన్న వెటర్నరీ అసిస్టెంట్ అందు బాటులో లేకపోవడం గమనార్హం. ఇక్కడ పనిచేస్తున్న ఏ ఒక్కరు కూడా స్థానికంగా నివాసం లేకపోవడంతో ఇటువంటి దుస్థితి ఏర్పడుతుందని గ్రామస్తులు అంటున్నారు. దూసిపేటలో 10 ఏళ్ల పాటు పని చేసిన వ్యక్తి కొత్తవలసకు బదిలీ అయినప్పటికీ ఉన్న తాధికారుల పలుకుబడితో గ్రామానికి వచ్చే దాఖలాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. ఉదయం వైద్యులు వచ్చి ఫోటోలు తీసి వెళ్లారు. ఇన్సూరెన్స్ అందించేందుకు చర్యలు చేపడతామని నిర్లక్ష్యంగా రైతుకు సమాధానం చెప్పడంతో రైతులు ఆవేదన చెందారు. గతంలో ఇదే గ్రామంలో లిమ్కీ వ్యాధితో ఆవు మృతి చెందినప్పటికీ ఏడి స్థాయి అధికారి ఈ వైద్యుని పై వేటు పడకుండా భరోసా ఇచ్చారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారుల చలువతొ దిగు స్థాయి సిబ్బంది తీరు, నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుంది. పశువుల ఆసుపత్రి పరిధిలో ఏ ఒక్కరు నివాసం ఉండటం లేదని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. పారదర్శక పాలన, అవినీతి రహిత పాలన అంటూ ప్రజల వద్దకే పశు వైద్యం పేరిట ప్రభుత్వం సకల సౌకర్యాలు కల్పిస్తుంది. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా కొందరు అధికారులు పనిచేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు తెలిసింది. ఇటీవల బొబ్బిలి పేట గ్రామంలో ఇదే పరిస్థితిలో మూగ జీవి మృతి చెందింది. ఇక్కడ కూడా వైద్యుల నిర్లక్ష్యం కనిపించింది. గత రెండు నెలల క్రితం పెంపుడు పొట్టేలను రైతు ఆముదాలవలస ఏడి పరిధి ఆసుపత్రికి తీసుకురాగా సరైన వైద్యం అందకపోవడంతో ఆ పొట్టేలు మృతి చెందిందని రైతు అప్పుడు ఆవేదన చెందారు. దానిపై ఉన్నతాధి కారుల కు ఫిర్యాదు చేస్తామని స్థానిక నాయకత్వానికి చెప్పడంతో శాసన సభాపతి తమ్మినేని సీతారాం దృష్టికి కూడా వెళ్ళింది. అప్పుడు ఏడి స్థాయి అధికారిని స్పీకర్ కార్యాలయం అధికారులు మంద లించారు. దీంతో సమస్య సద్దుమణిగింది. ఆముదాలవలస పరిధిలో అప్పటికి అధికారుల నిర్లక్ష్యం కారణంగా పశువులకు సరైన వైద్య సౌకర్యాలు అంద దం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వైద్య సేవలు మూగజీవాలకి అందించి వాటిని కాపాడాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది

అమ్మవారిని దర్శించుకున్న మంత్రి సీదిరి

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : భక్తుల పాలిట కల్పవల్లిగా పేరొందిన కోటబొమ్మాళి కొత్తమ్మతల్లిని మంత్రి సీదిరి అప్పలరాజు దంపతులు, స్పీకర్ తమ్మినేని సీతారాం, రాష్ట్ర కళింగ కార్పోరేషన్ చైర్మన్ పేరాడ తిలక్‌లు గురువారం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ సాంప్రదాయం ప్రకారం దేవాదాయ శాఖ ఆలయ కార్య నిర్వాహాధికారి వాకచర్ల రాధాక్రిష్ణ, ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ బోయిన మాధవిక్రిష్ణారావులు స్వాగతం పలకగా వేదపురోహితులు సుసరాపు గణపతిశర్మ, లక్ష్మీకాంతం శర్మలు పూర్ణకుంభంతో వేదమంత్రోచ్చారణల మధ్య ఆలయంలోనికి తీసుకువెళ్ళి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తర్వాత ఆలయ ముఖమండపంలో పురోహితులు ఆలయ సాంప్రదాయం ప్రకారం పూజలు నిర్వహించి ప్రసాదాన్ని ఇచ్చి కొత్తమ్మతల్లి విశిష్టతను వివరించారు. అలాగే ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, స్థానిక జూనియర్ సివిల్ జడ్జి డి. భరణిలు కొత్తమ్మతల్లిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కాగా శ్రీకాకుళంకు చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ దానేటి శ్రీధర్ అమ్మవారిని అదర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి వితరణగా రూ.లక్ష రూపాయిలు నగదును వితరణగా అందజేశారు. ఈకార్యక్రమంలో సంతబొమ్మాళి జడ్పీటీసీ పాల వసంతరెడ్డి, ఎంపీపీలు రోణంకి ఉమామల్లేశ్వరరావు, ఎన్.శ్రీరామ్మూర్తి, కళింగ కార్పోరేషన్ డైరెక్టర్ హేమసుందరరాజు, పీఏసీఎస్ అధ్యక్షుడు బాడాన మురళి, టెక్కలి సిఐ సూర్యచంద్రమౌళి, కోటబొమ్మాళి ఎస్ఐ షేక్ మహ్మద్అలీ, వైఎస్ ఎంపీపీలు బోయిన నాగేశ్వరరావు, దుక్క రోజారామక్రిష్ణ, సర్పంచ్ కాళ్ళ సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

అంబరాన్ని తాకిన కొత్తమ్మ జాతర ఉత్సవాలు

కిలోమీటర్లు పొడవున పోటెత్తిన భక్త జన సందోహం

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : స్దానిక శ్రీ కొత్తమ్మతల్లి జాతర ఉత్సవాలు అంబరాన్ని తాకాయి. మంగళవారం నుండి గురువారం వరకు మూడు రోజులు పాటు జరిగిన ఈ ఉత్సావాలు చివరి రోజైన గురువారం అత్యంత వైభవంగా ముగిసాయి. ఈ ఉత్సవాలు సందర్భంగా గురువారం వేకువజాము నుండే భక్తులు వేలాది సంఖ్యలో క్యూలైన్లలో బారులు తీరి కొత్తమ్మతల్లిని దర్శించు కున్నారు. వేకువజాము నుండే భక్తులు వేలాది సంఖ్యలో కొత్తమ్మతల్లిని దర్శించుకోని చీర, పళ్లుకాయలు, కోడిపుంజు, మేక, గొర్రె పోతులను బలి ఇచ్చి మ్రొక్కుబడులను తీర్చుకున్నారు. కొత్తపేట జంక్షన్ నుండి కోటబొమ్మాళి వరకు రెండు కిలోమీటర్లు దారి పొడవున అడుగు వేయడానికి వీలు లేని విదంగా భక్తుల రద్దీ ఉండడంతో పాదచారులు, వాహనదారులు నానా అవస్దలు పడవలసి వచ్చింది. పోలీస్‌శాఖ వారు ట్రాఫిక్ కంట్రోల్ చేయడానికి పలు చోట్ల వాహనాలను పార్కింగ్ చేయించారు. పగటి పూట గ్రామంలో పగటి వేషాలు, కొయ్యి డ్యాన్సులు భక్తులను అలరించాయి. స్దానిక రెడ్డిక వీదిలోగల కమ్మకట్టు చిన్నఅప్పలస్వామి ఇంటి నుండి అమ్మవారి జంగిడిని పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు మద్య తీసుకురాగా మహిళలు పసుపు కలశాలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారి దండకం చదివి తల్లిని చల్లదనం చేసారు. మెయిన్‌రోడ్డులో పోస్టు ఆఫీస్ అవరణలో రైసు మిల్లర్ల ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నసంతర్పణలో వేలాది మంది భక్తులు పాల్గొని అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు. ప్రజాపిత బ్రహ్మకూమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయంకు చెందిన ఓంశాంతి వారు ఆద్యాత్మిక ప్రవచనాలు భక్తులను ఎంతగానో ఆలోచింపజేసాయి. రెండు కిలోమీటర్లు పోడవున పుట్‌పాత్ దుకాణాలు వెలవడంతో భక్తులు షాపింగ్ చేసుకోవడానికి మంచి అవకాశం కలగడంతో వారి వ్యాపారాలు బాగా జరిగాయి. ఈసారి ఉత్సవాలకు ఎగ్జిబిషన్‌లో గల జైంట్‌వీల్, శాంతారా, టోరాటోరా, సలంబో, బ్రేక్ డ్యాన్స్‌తో పాటు స్విమ్మింగ్, రైలు, బెలూన్ వంటివి చిన్న పిల్లలకు ప్రత్యేక ఆకర్షణగా నిలవడంతో భక్తులు మూడు రోజులు కూడా చుట్టూ ప్రక్కల ప్రాంతాల నుండి అదిక సంఖ్యలో విచ్చేసారు. మొత్తం మీద ఈ సారి ఉత్సవాలు అత్యంత ఘనంగా జరగడంతో భక్తులు ఆనందం వ్యక్తం చేసారు.

పోలీస్ సేవలు భేష్ : జాతర సందర్భంగా పోలీసులు అందించిన సేవల పట్ల భక్తులు పోలీస్ శాఖకు మంచి కితాబు ఇచ్చారు. టెక్కలి సిఐ సూర్యచంద్రమౌళి ఆద్వర్యంలో కోటబొమ్మాళి ఎస్ఐ షేక్ మహ్మద్‌అలీ పర్యవేక్షణలో సుమారు 400 మంది పోలీసులు బారీ బందోబస్తు నిర్వహించారు. కొత్తమ్మతల్లి ఆలయ ప్రాంగణంలో పోలీస్ కంట్రోల్‌రూం ఏర్పాటు చేసి గ్రామమంతా సిసి కెమెరాలు, డ్రోన్‌లు ఏర్పాటు చేసి సిఐ ఎప్పటికప్పుడు పరిస్దితి తెలుసుకోని సిబ్బందిని అప్రమత్తం చేసారు. దీంతో ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలుకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షకు విశేష స్పందన

విశాలాంధ్ర-పలాస: రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహనరెడ్డి ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష పథకానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని పలాస పిఎసిఎస్ అధ్యక్షులు పైల వెంకటరావు (చిట్టి), ఎంపిపి ప్రతినిధి ఉంగ సాయిక్రిష్ణలు అన్నారు. గురువారం మండలంలో టెక్కలిపట్నంలో జగనన్న ఆరోగ్య సురక్ష పథకం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఇంటికి వెళ్లి సర్వే చేసి రోగులను గుర్తించి ఈ పథకం ద్వారా ఏర్పాటు చేస్తున్న వైద్య శిబిరంలో ఆయా రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నారు. అనంతరం వైద్య శిబిరంలో 310 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిడివో రమేష్‌నాయుడు, ఇవోపిఆర్‌డి మెట్ట వైకుంఠరావు, ఐసిడిఎస్ పి.వో డి.శార్వాణి, మండల సచివాలయ కన్వీనరు దువ్వాడ రవికుమార్, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు కొర్ల సంతోష్‌కుమార్‌లు పాల్గొన్నారు.

కాశీబుగ్గ : పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీలోని తాళభద్ర గ్రామంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, కమిషనర్ నాగేంద్రకుమార్, ఎ.ఇ అవినాష్, వైసీపీ నాయకులు డబ్బీరు నాగభూషణరావు, సిబ్బంది పాల్గొన్నారు.

తూర్పు కాపు సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శికి అభినందనల వెల్లువ

విశాలాంధ్ర-ఆమదాలవలస : జనసేన తూర్పు కాపు సంక్షేమ సంఘము రాష్ట్ర కార్యదర్శిగా పిసిని చంద్రమోహన్, నియమితులైన సందర్భంగా రాష్ట్ర యువజన ఉపాధ్యక్షులు కొల్ల జయరామ్, ఆమదాలవలస నియోజకవర్గ జనసేన నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం చంద్రమోహన్, జయరాములు మాట్లాడుతూ అధినేత పవన్ కళ్యాణ్ అడుగుజాడల్లో నడుస్తూ, ప్రశ్నించేతత్వం అలవర్చుకున్నామని, పేద ప్రజల గుండెచప్పుడు పవన్ అని, ఆయన ఆశయసాధన కోసం మేమంతా కలసికట్టుగా గెలుపే లక్ష్యంగా పని చేస్తామన్నారు. అలాగే మాకు అదనపు బాధ్యతలను అందించిన జన నేతకు కృతజ్ఞతలని, మా బాధ్యతలను క్రియాశీలంగా నిర్వర్తించి ప్రజలకు ఉపయోగపడే విధంగా పనిచేస్తామని తెలిపారు.

ఉన్నత స్థితిలో ఉండాలంటే హ్యాపీనెస్ కోర్సు చేయాలి

ఎఒఎల్ జిల్లా ప్రతినిధి డాక్టర్ కె.అమ్మన్నాయుడు

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: సమాజంలో ఉన్నత స్థితిలో జీవించడానికి అవసరమైన జ్ఞానాన్ని రవిశంకర్ గురుజీ బోధించారని ఆర్ట్ ఆఫ్ లీవింగ్ జిల్లా ప్రతినిధి డాక్టర్ కింజరాపు అమ్మన్నాయుడు తెలిపారు. గురువారం ఆదిత్య విద్యానిలయం, బలగ లో జరిగిన హ్యాపీనెస్ కోర్స్ ముంగింపు దినోత్సవ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురూజీ అందించిన ఈ అపారమైన జ్ఞానం, సుదర్శన క్రియలతో ఆరోగ్యం, ఆనందానికి, అవధులు ఉండవన్నారు. నిత్య సాధనతో ఒత్తిడి లేని మనసు ఆరోగ్యవంతమైన జీవితాన్ని పొందవచ్చని ప్రత్యేక అతిథి చిట్టీ జనార్ధన్ దాస్ అన్నారు. డిడిసి సభ్యులు బివి రవిశంకర్ మాట్లాడుతూ శారీరక, మానసిక ఆరోగ్యానికి ప్రతీఒక్కరూ ఆనందోత్సవ కోర్సు చేయాలన్నారు. ఈ ఆరు రోజుల కోర్సులో ప్రాణాయామం, యోగాసనాలు, సుదర్శన క్రియ, భస్త్రిక ప్రాణాయామం, ఉజ్జయిశ్వాస, సూర్య నమస్కారములను ఎఒఎల్ టీచర్ దేసూళ సురేంద్ర నేర్పించారు. ఈ కార్యక్రమం లో డాక్టర్ అమ్మన్నాయుడు, టీచర్ సురేంద్ర లను ఘనంగా సన్మానించారు. టీచర్స్ సురేంద్ర, గోవింద్, ఆదిత్య విద్యానిలయం ప్రిన్సిపాల్ దేసూళ రమేష్ బాబు, కరెస్పాండంట్ చిట్టీ రాము, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సత్సంగంలో చౌదరి శ్రీనివాస్ రావు, గేదెల ఉమాదేవి భజన గీతాలను అలపించగా, మృందగంపై లక్ష్మణ్ వాద్య సహకారాన్ని అందించారు.

జగనన్న చిత్రపటానికి పాలాభిషేకం

విశాలాంధ్ర-సందిగాం : గ్రామ పంచాయతీలో జగనన్న చేదోడు పథకం కింద లబ్ధిదారుల ఖాతాలో సొమ్ము జమ చేయడం చాలా సంతోషకరంగా ఉందని ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమం సర్పంచ్ జద్యేడ రమణమ్మ అధ్యక్షతన ఇన్చార్జి జద్యడ జయరాం ఆధ్వర్యంలో జరిగింది. వరుసగా నాలుగో ఏడాది అర్హులకు తమ ఖాతాల్లో డబ్బులు జమ కావడంతో అక్క చెల్లెమ్మలు నాయి బ్రాహ్మణ, టైలర్లు అన్నదమ్ములు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సందిగాం వన్ ఎంపీటీసీ అంబోదు విష్ణు, పంచాయతి సెక్రటరీ లత, సచివాలయ కన్వీనర్ మోహన్, వెల్ఫేర్ అసిస్టెంట్లు, వాలంటీర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

రూ.12 కోట్లు చెల్లింపులు : డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ జయరాజ్

విశాలాంధ్ర-మెళియాపుట్టి : పాడి పశువుల నష్టపరిహారం గతానికి సంబంధించి 2019 నుండి 2021 ఏప్రిల్ నెల వరకు 12 కోట్ల రూపాయలు చెల్లింపులు జరిపినట్లు టెక్కలి పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ జయరాజ్ తెలిపారు. మెళియాపుట్టి మండల కేంద్రంలో గల పశువైద్యశాలను గురువారం నాడు సందర్శించి, రికార్డులను పరిశీలించారు. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పాడి పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్లు పెంపకందారులకు అందించే పశు విజ్ఞాన బడులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. టెక్కలి డివిజన్ పరిధిలో 40 మంది వైద్యులకు 23 మంది మాత్రమే ప్రస్తుతం ఉన్నారని, ఇంకా 17 మంది వైద్యుల ఖాళీలు ఉన్నాయన్నారు. ఇంకా 11 కోట్ల రూపాయల వరకు పాడిపశువుల నష్టపరిహారం చెల్లింపులు జరపవలసి ఉందన్నారు. రాయితీపై పాడి రైతులకు అందిస్తున్నా పశుపోషణ ప్రస్తుతానికి నిలుపుదల చేయడం జరిగిందని తెలియజేస్తునే, ప్రభుత్వ పరంగా ఆర్థిక లావాదేవీలు తెలిన తరువాత రైతులకు పశుపోషణ సరఫరా చేయడం జరుగుతుందన్నారు. ఈ సందర్శనలో డిప్యూటీ డైరెక్టర్ జయరాజ్ తో పాటు పశువైద్యులు పారిశెల్లి అనిల్ కుమార్, సిబ్బంది గణపతిరావు, రమేష్, తదితరులున్నారు.

పేదలకు వరం... జగనన్న సురక్ష : ఎంపీపీ

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : ప్రభుత్వం చేపట్టిన జగనన్న సురక్ష పథకం పేదలకు వరమని స్థానిక మండల పరిషత్ అధ్యక్షుడు రోణంకి ఉమామల్లేశ్వరరావు అన్నారు. గురువారం మండలంలోగల నీలంపేట గ్రామ సచివాలయ పరిధిలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మారుతున్న ఆహారపు అలవాట్లు, జీవన విధానం వల్ల ప్రజల్లో పలు రకాల రుగ్మతలు తలెత్తుఉన్నాయన్నారు. అందుకు తగినట్లుగానే వైద్యం పేదలకు అందని ద్రాక్షలా మారిందని దీనిని దృష్టిలో పెట్టుకొని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి ప్రజలవద్దకే వైద్యం తీసుకు వచ్చారని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ప్రాధమిక వైద్య కేంద్రం వైద్యరాలు డాక్టర్లు డి. నీరజ, మనీష, ప్రీతి, జోత్న, సురేష్, నితీష్‌కుమార్‌లు 491 మంది పలు రకాల పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అలాగే డీఎంహెచ్‌వో బమ్మిడి మీనాక్షి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పరిశీలించి వైద్యులకు పలుసూచనలు, సలహాలు ఇచ్చి రోగులకు మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కె. ఫణీంద్రకుమార్, డిప్యూటీ తహసీల్దార్ ఆర్. మధు, ఈవోపీఆర్‌డీ బొడ్డేపల్లి రామారావు, రాష్ట్ర కళింగ కర్పోరేషన్ డైరెక్టర్ సంపతిరావు హేమసుందరరాజు, స్థానిక సర్పంచ్‌లు పట్ట పట్నాన శ్రీనివాస్, మెట్ట ఈశ్వరమ్మ సింహాచలం, ఎంపీటీసీ బొండు చెంచులు, నాయకుడు పేడాడ వెంకటరావు, పట్నాన శివ తదితరులు పాల్గొన్నారు.

నివగాంలో జగనన్న ఆరోగ్య సురక్ష

విశాలాంధ్ర-కొత్తూరు : మండలం నివగాం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం గురువారం జరిగింది. ముఖ్య ప్రాతినిది వైస్ ఎంపీపీ లోతుగెడ్డ తులసి వర ప్రసాదరావు పాల్గొని ఈ కార్యక్రమ ప్రాధాన్యత, అవస్యకతను వివరించారు. ప్రజల అరుగ్యానికి సీఎం జగన్ మోహెన్ రెడ్డి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుంది మి గ్రామానికి మీ ఇంటిముందుకు వైద్యాధికారులను రప్పించి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు ను అందజేస్తుంది అని అన్నారు. వైస్ ఎంపీపీ లోతుగెడ్డ వెంట స్థానిక నాయకులు టంకాల రమణారావు, రేగేటి కన్నయ్య స్వామిలున్నారు.

పోటీ ప్రపంచానికి నైపుణ్య అభవృద్ధి శిక్షణ ఎంతో అవసరం

విశాలాంధ్ర-కవిటి: నేటి పోటీ ప్రపంచానికి నైపుణ్య అభివృద్ధి శిక్షణ ఎంతో అవసరమని స్కిల్ డెవలప్మెంట్ కోర్స్ శిక్షకులు చిన్మయి అన్నారు. ఈ మేరకు గురువారం మండల కేంద్రమైన కవిటి ఎస్‌విజె విద్యార్థులకు గత నెల రోజులుగా నైపుణ్య అభివృద్ధి శిక్షణ అందజేసి ముగింపు సందర్భంగా సమావేశం నిర్వహించారు. స్కిల్ డెవలప్మెంట్ కోర్స్ అందించిన బరంపురం కు చెందిన చిన్మయి మేడం మాట్లాడుతూ విద్యార్థులు స్కిల్ కోర్స్ లో భాగంగా వివిధ విద్య సంస్థలలో శిక్షణ అందజేయడం జరుగుతుందని తెలిపారు. చీఫ్ గెస్ట్ బాలక శ్రీనివాస్, ఎస్ వి జె మేనేజర్ బి వి వి ప్రసాద్ రావు మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో స్కిల్ కోర్స్ విద్యార్థులు కు ఎంతో అవసరమని విద్యార్థుల పోటీ పరీక్షలకు స్కిల్ కోర్స్ కోసం తెలుసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

జి బి యస్ వ్యాధిగ్రస్తునికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర-కవిటి: మండలంలోని శవసానపుట్టుగ గ్రామంకు చెందిన ఈగల నాగేష్ గత కొంత కాలంగా గులియన్ బ్యారీ సింద్రోమ్(జి బి యస్) అనే వ్యాధితో బాధపడుతున్నారు. నగేష్ ప్రస్తుతం విశాఖపట్నం విజేత హాస్పిటల్లో ట్రీట్మెంట్ జరుగుతుంది. మెరుగైన వైద్యం కోసం రోజుకి సుమారు లక్ష రూపాయలు ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పడం జరిగిందనీ ఇలా 20 రోజుల పాటు చికిత్స చేయాలనీ వైద్యులు సూచించారని తెలిపారు. మొత్తం వైద్యానికి 20 లక్షలు ఖర్చు అవుతుందని తెలిపారు. నగేష్ కుటుంబం కూలి చేస్తే పూట గడవనిస్థితి. పలు స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చి సహాయం చేయాలని కోరారు. ఈ మేరకు గురువారం గ్రామస్తులు, యువత జై హింద్ సేవా ఫౌండేషన్ సంస్థ దృష్టికి తీసుకువెళ్ళి ఆర్థిక సహాయంగా 35 వేలు రూపాయలు మండల కోసం సభ్యులు చేతుల మీదుగా అందజేశారు. మరిన్ని స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి సహాయం అందించాలని జై హింద్ సేవా ఫౌండేషన్ సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, జైహింద్ సేవ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

అమ్మవారికి విశేష అలంకరణలో కుంకుమార్చనలు

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్: శ్రీశ్రీశ్రీ దుర్గా మహాలక్ష్మి దేవాలయం బాకర్స్ పేటలో ఐదోవ రోజు మహాలక్ష్మి దేవి అవతారంగా అమ్మవారికి విశేషమైన అలంకరణలో సామూహిక కుంకుమార్చనలు కమలాలయే సంపుటిత శ్రీ సూక్త విధానేనా ఉత్సవమూర్తులకు సుగంధ ద్రవ్యాలతో క్షీరాభిషేకం సామూహిక కుంకుమార్చనలు జరిగాయి. చుట్టుపక్క గ్రామాల నుంచి మరియు కాలనీ నుండి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని సామూహిక కుంకుమార్చనలు, సహస్ర ఎర్ర కలవ పువ్వులతో సహస్రనామావళి పూజ జరిపించుకున్నారు. కమలాలయ సంపుటిత సహిత దుర్గా హెూమం, సప్తశతి పారాయణ సప్తశతి హెూమం జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకులు తెన్నేటి సునీల్ శర్మ ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు మండల మన్మధరావు, సొంగలు గణేష్, శ్యాంసుందర్, నీలం రాజు, మహిళా మండల్ సభ్యులు పద్మ, రవళి, కళ్యాణి, శ్రీ లక్ష్మీ, స్వప్న, మేనక తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి చిత్ర పటానికి క్షీరాభిషేకం

విశాలాంధ్ర-కవిటి: జగనన్న చేదోడు కార్యక్రమం ప్రారంభించిన సందర్భంగా లబ్దిదారులు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేపట్టారు. ఈ మేరకు గురువారం మండలంలోని సిలగాం గ్రామ సచివాలయం వద్ద ఎం పి పి కడియాల పద్మ ప్రకాష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న నాయీ బ్రాహ్మణులు, రజకులు, టైలర్ల జీవితాల్లో మార్పు రావాలని వారు మిగతా ప్రపంచంతో పోటీపడి ఎదగాలని వారికీ చేదోడనిస్తూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నాల్గవ ఏడాది జగనన్న చేదోడు కార్యక్రమాన్ని ప్రారంభించి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసిన సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందనీ తెలిపారు. ఈ సందర్భంగా జగనన్న చేదోడు లబ్ధిదారులు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కడియాల బాబురావు, పంచాయతీ కార్యదర్శి మన్మధరావు, సచివాలయ సిబ్బంది, సచివాలయ కన్వీనర్లు, గృహ సారధులు, వాలంటీర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గాదేవి ఉత్సవాలు

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : దుర్గాదేవి నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా సంతబొమ్మాళి మండలంలో పలు గ్రామాల్లో ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సంతబొమ్మాళి, నౌపడ, బోరుభద్ర తదితర గ్రామాల్లో నెలకొల్పిన దుర్గాదేవి మందిరాల వద్ద భక్తులు పూజలు, భజనలు, లలితా సహస్రనామాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆయా కార్యక్రమాల్లో ఆయా గ్రామాలకు చెందిన భక్తులు, సత్యసాయిబాబా భజన మండలి భక్తులు, శిరిడి సాయిబాబా భజన మండలి భకులు, మాలాధారణ చేసిన భవాని భక్తులు, సాధారణ భక్తులు విరివిగా పాల్గొని ఘనంగా దుర్గాదేవి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.

కార్పొరేట్ స్థాయిలో వైద్యసేవలు అందించడమే లక్ష్యం : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-మెళియాపుట్టి: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ఇంటివద్దే ప్రతి ఒక్కరికి కార్పొరేట్ స్థాయిలో వైద్యసేవలు అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బృహత్తర పథకాన్ని మనకు అందించారని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా గురువారం మెళియాపుట్టి మండలం జాడుపల్లి గ్రామంలోని పాఠశాల ఆవరణలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష-హెల్త్ క్యాంప్ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్యాధికారులు, సిబ్బంది స్వయంగా వెళ్ళి అవసరమైన పరీక్షలను చేసి వ్యాధిని గుర్తించి వైద్యసేవలు అందిస్తారన్నారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆమెతో పాటు ఎంపీపీ ప్రతినిధి ఉదయ్ కుమార్ పిఎసిఎస్ అధ్యక్షులు బాలరాజు, ఎంపీడీవో చంద్రకుమారి, డెప్యూటీ తహసిల్దార్ శంకరరావు, వైద్యాధికారులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది, ప్రజలు తదితరులున్నారు.

ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే సీఎం ఆకాంక్ష

పేరాడ తిలక్

విశాలాంధ్ర-నందిగాం: ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆకాంక్ష అని రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ అన్నారు. గురువారం నందిగామ మండలం పెద్ద తామరపల్లి సచివాలయ పరిధిలో సర్పంచ్ తమరి దేవేంద్రరావు ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎంపీపీ నడుపూరు శ్రీరామ్ మూర్తితో కలిసి తిలక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా తిలక్ మాట్లాడుతూ వైద్యం అందించే ఘనత మన సీఎం జగన్ మోహన్ రెడ్డి కే దక్కిందని అన్నారు. రోగులకు మందులను పంపిణీ చేసి వృద్ధులకు కళ్లద్దాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు. ఎంపీడీవో శివప్రసాద్. డిప్యూటీ తహసిల్దార్ ధనలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, సచివాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది, వాలంటీర్స్, అధికారులు పాల్గొన్నారు.

21న జెడ్.పి.స్థాయి సంఘ సమావేశాలు

- జిల్లా పరిషత్ సి.ఈ.ఓ ఆర్.వెంకట రామన్

విశాలాంధ్ర-శ్రీకాకుళం: జిల్లా ప్రజా పరిషత్ స్థాయి సంఘ సమావేశాలు ఈ నెల 21న నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఆర్.వెంకటరామన్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన జారీచేశారు. శనివారం అక్టోబర్ 21న జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 10.00 గం.లకు స్థాయి సంఘాల సమావేశం ప్రారంభం అవుతాయన్నారు. ఉదయం 10.00 గం.లకు 6వ స్థాయి, 11.00 గం.లకు 3వ స్థాయి, మధ్యాహ్నం 12.00 గం.లకు5వ స్థాయి సంఘం సమావేశం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మధ్యాహ్నం 2.00 గం.లకు 2వ స్థాయి, 3.00 గం. లకు 4వ స్థాయి, సాయంత్రం 4.00 గం.లకు 7వ స్థాయి , సాయంత్రం 5.00 గం.లకు 1వ స్థాయి సంఘ సమావేశాలు జరగనున్నట్లు ఆయన ఆ ప్రకటనలో వివరించారు.

పలాస ఆర్డీఓ సీతారామ మూర్తి బదిలీ

విశాలాంధ్ర-పలాస: నూతనంగా ఏర్పడిన పలాస ఆర్డీఓ కార్యాలయం కు మొట్ట మొదటి ఆర్డీఓ గా పనిచేసిన టీ. సీతారామ మూర్తి కు ప్రభుత్వం డిప్యూటీ కలెక్టర్ గా పదోన్నతి కల్పించి బదిలీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్డీఓ స్థాయి గల 60 మంది అధికారులను బదిలీ చేస్తున్నట్లు ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు విడుదల చేసింది. సీతారామ మూర్తి స్థానం లో ఎస్. భరత్ నాయక్ ను పలాస ఆర్డీఓ భాద్యతలు చేపట్టనున్నారు.

ఘనంగా కుంకుమ పూజలు

విశాలాంధ్ర-వజ్రపుకొత్తూరు: దేవీనవరాత్రుల సందర్భంగా బైపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న దుర్గాదేవి నవరాత్రుల మహెూత్సవాల్లో భాగంగా గురువారం భక్తులు ఘనంగా కుంకుమ పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ శిబిరాలు

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : సంతబొమ్మాళి, నౌపడ శాఖా గ్రంథాలయాల్లో విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరాలను ఆయా గ్రంథాలయాధికారులు, కె కృష్ణారావు, బి రూపావతి ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వార్తాపత్రికలు చదవడం నీతి కథలు చదవడం, చిత్రలేఖనం పోటీలు నిర్వహించడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు ఈ కార్యక్రమాల్లో విద్యార్థులు ఆయా గ్రంథాలయాల సహాయకులు ప్రసాదు, బాబురావులు పాల్గొన్నారు.